సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 20 । మార్చి । 2023



## ఏకరూపం.. ఆకర్షణీయం



మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలు మార్చుతున్న ప్రభుత్వం..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. ఈమేరకు యూనిఫాం డిజైన్‌ను విద్యాశాఖ మార్చింది. 8లో▸



## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తాంసిలోని విద్యానగర్ సాయిబాబా ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/18.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రవికాంత్‌కు డాక్టరేట్



రవికాంత్‌కు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలం భరంపూర్‌కు చెందిన మామిడి రవికాంత్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆదివారం పట్టా అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో పరిశోధన చేయడంతో జేఎన్‌టీయూ ఇటీవల డాక్టరేట్ ప్రకటించింది. రవికాంత్ ప్రస్తుతం మల్లారెడ్డి వర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

### ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఏవీఎన్ రెడ్డిని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (టీయూపీఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, గోపీకృష్ణ ఆదివారం కలిశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇందులో సంఘం నాయకులు పాల్గొన్నారు.

### బెంగళూరు పర్యటనలో మున్సిపల్ కమిషనర్



అక్కడి మున్సిపల్ అధికారులతో కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో మార్చి 8 నుంచి 29 వరకు స్వచ్ఛత ఉత్సవం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందిని ఒడిశా, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు తడి, పొడి చెత్త వినియోగంపై అధ్యయనానికి పంపించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ నుంచి కమిషనర్ శైలజ, డీఆర్పీ నిర్వాహకురాలు టి.నవత వెళ్లారు. ఆదివారం అక్కడ పర్యటించారు. బెంగళూరు నగరపాలక సంస్థ తడి, పొడి చెత్త నిర్వహణ ఏవిధంగా అమలు చేస్తున్నదో పలు విషయాలపై అధ్యయనం చేశారు. అలాగే అక్కడి విధాన సభను సందర్శించారు.

### ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 25, 26, 27 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, గత పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్ పోరాట కర్తవ్యాలను మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. 25న మంచిర్యాలలో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, 26, 27 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన ప్రతినిధుల మహాసభ ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లయ్య, రుతిక, స్వప్న, కవిత, విజయ పాల్గొన్నారు.

### వాహన పన్ను చెల్లించాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పన్నులను ఆన్‌లైన్‌లో లేదా ఆర్టీవో ఆఫీసులో మార్చి 31లోగా చెల్లించాలని రవాణాశాఖ ఎంవీఐ గట్టు ప్రదీప్ కుమార్ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ పాటించి రహదారి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అకాల వర్షం.. అపార నష్టం



నేలవాలిన జొన్న పంట

- కన్నీళ్లు మిగిల్చిన వడగళ్లు
- వందల ఎకరాల్లో నేలవాలిన జొన్న, మొక్కజొన్న
- ఆందోళనలో రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

బోథ్: జిల్లాలో కురిసిన అకాల వర్షం రైతులకు కన్నీటిని మిగిల్చింది. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానతో భారీగా పంట నష్టం వాటిల్లింది. కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో ప్రకృతి కన్నెర్ర జేసింది. వడగళ్లతో జొన్న, మొక్కజొన్న, గోధుమ, నువ్వు పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. కళ్లముందే పంటలు వర్షార్పణం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు. జిల్లాలో బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల్లో అకాల వర్షం ప్రభావం ఎక్కువగా ఉంది. వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.



కుమారిలో దెబ్బతిన్న నువ్వు పంట

**3వేల ఎకరాల్లో పంట నష్టం..**

వడగళ్ల వానతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న, జొన్న పంటలు ఎక్కువగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తిస్థాయి నివేదిక త్వరలో అందిస్తామని వారు పేర్కొంటున్నారు.

### గ్రామాల్లో పంట నష్టం పరిశీలన



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: మండలంలో కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఏడీఏ శ్రీధర్, ఏవో విశ్వామిత్ర ఆదివారం పరిశీలించారు. వివిధ గ్రామాల్లో నేలకొరిగిన పంటలను పరిశీలించి నివేదికను సిద్ధం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.వారి వెంట ఏఈఓ వాజీద్, శ్యాంసుందర్ ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని కుప్టి, కుమారి గ్రామాల్లో వడగళ్లతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు జి.శ్రీధర్‌స్వామి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలస్యంగా విత్తిన మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఏవో భాస్కర్ ఉన్నారు.

### చేతికొచ్చిందనుకుంటే.. నేలవాలే



నేను ఐదెకరాల్లో మొక్కజొన్న వేసిన. శనివారం సాయంత్రం కురిసిన వడగళ్లకు మూడెరాల్లో పంట పూర్తిగా నేలకొరిగింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపిస్త లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఇప్ప లక్ష్మణ్, బోథ్

### పరిహారం చెల్లించాలి

బోథ్: వడగళ్లతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కనుగుట్ట, కౌఠ, పొచ్చెర గ్రామాల్లో నేలకొరి గిన మొక్కజొన్న పంటను ఆదివారం పరిశీలించారు. బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యులు అశోక్,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

### పెట్టుబడి కూడా వచ్చేటట్టు లేదు..



నేను మూడెకరాల్లో మొక్కజొన్న వేసిన. పంట ఆశాజనకంగా ఉన్న క్రమంలో కురిసిన వడగళ్లకు పంట మొత్తం నేలకొరిగింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్టు కనిపిస్త లేదు. ప్రభుత్వం సర్వే చేసి పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– కొమ్ము గోవర్ధన్, కుచులాపూర్, బోథ్ మండలం

### రైతులను ఆదుకోవాలి



వడగళ్లతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలి. బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. – సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

# కాసులివ్వకుంటే కాఠిన్యమే!



ఇది ఆదిలాబాద్ పట్టణం రణదీవేనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అక్రమ లేఅవుట్. ఇందులోని 30కి పైగా ప్లాట్లను ఇప్పటికే దొడ్డిదారిన విక్రయించేశారు. అయినా దీనిపై బల్దియా అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.



మున్సిపల్ అధికారులు బోర్డు ఏర్పాటు చేసిన ఈ స్థలం ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్‌బోర్డు పరిధిలోని సర్వేనంబర్ 162/2, 163/1 లోనిది. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారనే కారణంతో ఆ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పట్టణంలోని అన్ని అక్రమ లేఅవుట్లపై ఎందుకిలా వ్యవహరించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా అధికారులు కొందరిపై చూపుతున్న 'మామూలు' తీరు ఇందుకు బలాన్ని చేకుర్చుతుంది.

- అక్రమ లేఅవుట్లపై చర్యల్లో పక్షపాత వైఖరి
- 'టౌన్ ప్లానింగ్' తీరుపై సర్వత్రా విమర్శలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా కొన్నింటిని పట్టించుకోని వైనం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల తీరు వివాదాస్పదమవుతోంది. కాసులిచ్చే వారిపై కారుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. చేయి తడపని వారిపై కాఠిన్యాన్ని చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల ఆ విభాగం అధికారులు అనుసరిస్తున్న తీరే అద్దం పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లపై కొరడా ఝులిపించాల్సిన సంబంధిత అధికారులు అందులో పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేదంటే మరోలా అన్నట్లుగా వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమ లేఅవుట్లపై చర్యలేవి..?**

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. తదనుగుణంగా బడా వ్యాపారులు, రాజకీయ నాయకులు లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములనే తేడా లేకుండా కానిచ్చేస్తున్నారు. వీటికి డీటీసీపీ, మున్సిపల్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే లేవుట్‌లో పార్కు, దేవాలయం, స్కూల్, వాటర్ ట్యాంక్ వంటి ప్రజావసరాల కోసం 15 శాతం భూమిని ఖాళీగా వదలాలి. ఇలా చేస్తే తమకేం గిట్టుబాటు కాదనే ఉద్దేశంతో రియల్ వ్యాపారులు నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. ఇందులోనే కొత్త ఎత్తుగడకు తెర లేపుతున్నారు. అధికారులకు ‘మామూళ్లు’ ఎరవేసి నిబంధనలను పాటించినట్లుగా చూపుతూ అనుమతులు పొందుతున్నారు. ఆర్భాట ప్రచారంతో వాటిని ప్లాట్లుగా చేసి ప్రజలకు అంటగడుతున్నారు. ఈ క్రమంలో వాటిని కొనుగోలు చేసిన జనం ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో అసలు విషయం తెలిసి ఆందోళనకు గురవుతున్నారు. లే అవుట్ నిబంధనల ప్రకారం లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించకపోవడం, బ్యాంకు రుణం పొందే వెసులుబాటు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

**చర్యల్లో పక్షపాత వైఖరి..**

అనుమతి లేని లేఅవుట్లపై కొరడా ఝులిపించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చర్యల్లో పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారు. రియల్ వ్యాపారులిచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి నిబంధనలకు తిలోదకాలిస్తున్నారనే విమర్శలున్నాయి. కాసులిస్తే ఎలాంటి అనుమతులు లేకుండా వెలిసిన లేఅవుట్లను చూసీ చూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు కాసులివ్వకుంటే మాత్రం వాటిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. పట్టణ శివారులోని తంతోలి, కచ్‌కంటి, రణదీవేనగర్, ఖానాపూర్, మావల ప్రాంతాల్లో వెలిసిన అక్రమ వెంచర్లు, లేఅవుట్లపై ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనం. అలాగే తమకు కాసులివ్వకుంటే మాత్రం కఠినంగా వ్యవహరిస్తున్నారు. సర్వే నంబర్ 68, అనుకుంట, ఖానాపూర్ కాలనీల్లోని పలు లేఅవుట్లలోని బండ రాళ్లను తొలగించేశారు. తాజాగా 163 సర్వే నంబర్‌లో ప్రజావసరాలకు కేటాయించిన భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారనే కారణంతో స్వాధీనం చేసుకున్నారు. అదే మావల మండల కేంద్రంలోని బంజారాహిల్స్, గ్రీన్‌వ్యాలీలోనూ ప్రజావసరాల కోసం కేటాయించిన భూమిలో చేపట్టిన నిర్మాణాలపై మౌనం వహించడం వారి పక్షపాత వైఖరికి అద్దం పడుతోంది.

### చర్యలు తీసుకుంటున్నాం..

అక్రమ లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. గ్రీన్ వ్యాలీ, బంజారాహిల్స్‌లోనూ ప్రజావసర స్థలాల్లో నిర్మాణాలు చేపడితే రెండు నెలల క్రితమే చర్యలు తీసుకున్నాం. రణదీవేనగర్ లేఅవుట్‌పై చర్యల కోసం కమిషనర్‌కు ఫైల్ పెట్టాం. అనుమతి రాగానే చర్యలు తీసుకుంటాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. 163 సర్వే నంబర్‌లోని స్థలంపై చర్యల విషయం నాకేమి తెలియదు. దాని గురించి విచారించి చర్యలు తీసుకుంటాను. – అనురాధ, టీపీఓ, ఆదిలాబాద్

# అధికారంలోకి రాగానే పేదలకు 'ఇందిరమ్మ' ఇల్లు



పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- జిల్లాలో నాలుగోరోజు 'పీపుల్స్ మార్చ్'

ఉట్నూర్/ఇంద్రవెల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ రూ.ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర జిల్లాలో నాలుగో రోజు కొనసాగింది. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచి ఆదివారం ప్రారంభమైన యాత్ర ఈశ్వర్‌నగర్ మీదుగా మండలంలోని ఎందాకు చేరుకుంది. అక్కడ విశ్రాంతి అనంతరం సాయంత్రం యాత్ర కొనసాగించారు. ఆయన వెంట ప్రజాయుద్ధనౌక గద్దర్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తదితరులు కలిసి నడిచారు. శ్యాంపూర్‌లో ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్గమధ్యలో స్థానికులను కలుస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. నాగాపూర్ గ్రామంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రజా సంక్షేమంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. లాల్‌టెక్డీలో రాత్రి బస అనంతరం సోమవారం పాదయాత్ర కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చేరనుంది.

**అధికారంలోకి రాగానే పోడు సమస్య పరిష్కరిస్తాం..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని భట్టి విక్రమార్క అన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద తుడుందెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భట్టికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలో రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, ప్రధాన కార్యదర్శి బాపూరావ్, మహిళా సంఘం నాయకురాలు పుష్పరాణి తదితరులున్నారు.

## గిరిజనులను అడవికి దూరం చేసే కుట్ర

ఉట్నూర్: అడవులపై హక్కు పూర్తిగా ఆదివాసీ గిరిజనులదే అని, అయితే వారినే అడవి నుంచి దూరం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ సర్కార్ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 'పీపుల్స్‌మార్చ్' యాత్ర నాలుగో రోజు ఉట్నూర్ మండలంలో కొనసాగింది. అంతకుముందు ఎందా సమీపంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఉందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ప్రకటించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఉన్న ఐటీడీఏను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మిషన్ భగీరథ పథకంలో రూ.42వేల కోట్ల అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఈ అక్రమాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. లిక్కర్ స్కాంలో భాగస్వామి అయిన కవితపై చట్టరీత్యా చర్యలు తీసుకునే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు.



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో రూ.18 లక్షల కోట్ల నిధులతో మిగులులో ఉన్న మనం ప్రస్తుతం రూ.5 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లామన్నారు. స్వరాష్ట్రంలో నీళ్లు లేవు..నిధులు లేవు..నియామకాలు లేవు..అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రతీ పనికి కమీషన్ వసూలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, వరంగల్ మాజీ మేయర్ స్వర్ణ, ఏఐసీసీ ప్రతినిధి వినోద్‌నాయక్, నాయకులు గంద్రత్ సుజాత, జేడీపీటీసీ చారులత, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రజినీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



అలరిస్తున్న జబర్దస్త్ ఫేమ్ ఉదయ్, జితేందర్



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

రెండున్నర దశాబ్దాల తర్వాత వారంతా మళ్లీ ఒకేచోట కలుసుకున్నారు. ఆప్యాయ పలకరింపులు.. ఆలింగనాల అనంతరం చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. రోజంతా ఆడిపాడి సంతోషంగా గడిపారు. ఇందుకు చదువులమ్మ ఒడి వేదికైంది. మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 26 ఏళ్ల తరువాత నాటి మిత్రులు 80 మంది మళ్లీ ఒకే చోట చేరి సందడి చేశారు. జబర్దస్త్ ఆర్టిస్టులు జితేందర్, ఉదయ్‌కుమార్ హాజరై తమ నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. – తాంసి

## పడిపోతున్నా పట్టించుకోరా?



కలెక్టరేట్ ఎదుట ఒక వైపునకు పడిపోయిన ట్రాఫిక్ సిగ్నల్

జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కలెక్టరేట్ ముందున్న సిగ్నల్ కిందకు వంగి ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. ఈద్గం వద్ద ఉన్న సిగ్నల్స్ ఏడాదిగా పనిచేయడంలేదు. మంత్రి నివాసం వద్ద ఉన్న సిగ్నల్స్ కిందపడి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మంత్రి నివాసం వద్ద కిందపడిపోయిన ట్రాఫిక్ సిగ్నల్



ఈద్గామ్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

## క్లుప్తంగా

### గేట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్

భైంసా(ముథోల్): గేట్–2023 ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చైతన్య 293వ ర్యాంకు, మణిప్రసాద్ 912వ ర్యాంకు, జగదీశ్ 234వ ర్యాంకు, శివకుమార్ 563వ ర్యాంకు సాధించారు. ఆదివారం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ శాఖాధిపతి కార్తీక్, అధ్యాపకులు ధీరజ్, ప్రణయ, తేజస్విని, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

### నిర్మల్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాహితి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహితి ముధుల్కర్ ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. గత విద్యా సంవత్సరం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లలో అత్యధిక మార్కులు సాధించింది. యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ గోల్డ్ మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. సదరు విద్యార్థినిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీజీ రెడ్డి, అధ్యాపకులు రవికుమార్, శ్రీహరి, నర్సయ్య అభినందించారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

అదిలాబాద్ రూరల్: మండలంలోని అర్లి(బి) శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. అర్లి(బి) గ్రామానికి చెందిన నలుగురు, అడ, కంట గ్రామానికి చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వారివద్ద నుంచి రూ.19,360 నగదు, 5 ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### టవేరా చోరీ

జైనథ్: మండల కేంద్రానికి చెందిన ఉల్లాస్‌కు టవేరా వాహనం చోరీకి గురైంది. బాధితుడు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లాస్ ఈనెల 16న రాత్రి ఇంటి ఎదుట టవేరా వాహనం నిలిపాడు. ఉదయం లేచి చూడగానే కనిపించ లేదు. రెండు రోజుల పాటు వాహనం కోసం గాలించాడు. ఆచూకీ దొరకకపోవడంతో చోరీకి గురైంది భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏకరూపం.. ఆకర్షణీయం

- స్కూల్ యూనిఫాం డిజైన్ మార్చిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లోనే కుట్టించేలా చర్యలు
- పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందుబాటులోకి..

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలను మార్చుతున్న ప్రభుత్వం ..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాం 2023–24 సంవత్సరానికి గాను జాప్యం కాకుండా ముందుస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లెక్కలు తీసి అవసరమైన ముడి వస్త్రం ఆర్డర్ ఇచ్చింది. ఈ నెలాఖరు వరకు జిల్లాలకు నూతన ముడి వస్త్రం వచ్చేలా చర్యలు చేపడుతోంది. గతేడాది యూనిఫాం పంపిణీలో జాప్యం కారణంగా పంద్రాగస్టుకు కూడా పాత దుస్తులే ధరించాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల ప్రారంభం నుంచే యూనిఫాం అందించేలా ప్రణాళికలు రూపొందించింది. ముడి వస్త్రం జిల్లాకు చేరగానే సెలవుల్లోనే దర్జీ వద్దకు చేర్చి అక్కడి నుంచి పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాలని సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.

**విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3, 481 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,18,853 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండు జతల యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ముడివస్త్రం టెస్కో నుంచి 10,80,447 మీటర్లు ఉమ్మడి జిల్లాకు సరఫరా చేయనుంది. మొదట నేరుగా ఎమ్మార్సీలకు అక్కడి నుంచి పాఠశాల స్థాయికి చేర్చనున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎంలకే దుస్తులు కుట్టించే బాధ్యతలు అప్పగించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టించే బాధ్యతను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించారు. ఏమాత్రం జాప్యం జరుగకుండా వేసవి సెలవులు ముగిసే నాటికి యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారు.




మార్చిన డిజైన్లు ఇవే(ఫైల్)

**సరికొత్తగా యూనిఫాం..**

వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం సరికొత్తగా డిజైన్ చేశారు. రంగు మార్చకుండా డిజైన్ మాత్రమే మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విధి విధానాలు రూపొందించారు. 1 నుంచి 3వ తరగతి బాలికలకు బాడీఫ్రాక్‌లు, రైట్‌సైడ్ లోపలికి ఒకపాకెట్, ఎదురు కుచ్చిళ్లు, 2 ఇంచులు పట్టితో కుట్టనున్నారు. బాడీ ఫ్రాక్‌కు కింద షర్టుక్లాత్‌తో 2 ఇంచులు వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు సూటింగ్ క్లాత్‌తో కుట్టనున్నారు. షర్టుకు చేతులకు పట్టీలు, క్లిప్‌లు, షూటింగ్ క్లాత్‌తో వేయాల్సి ఉంది. క్లిప్ పొడువు 3 ఇంచులు, వెడల్పు ఇంచుతో యూనిఫాం డిజైన్ రూపొందించారు. ఇక 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు కుట్టడం, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, బుజాలపైన క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులు(హ్యాండ్ లూప్స్) తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్ డిజైన్ చేశారు. టాప్, రెండు చేతులకు క్లిప్‌లు, ముందు భాగాన యు ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేశారు. 1 నుంచి 12వ తరగతి వరకు బాలురుకు షర్టుకు రెండు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు గుండీతో పెట్టి కుట్టాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు.

**పాఠశాలలు తెరిచే నాటికి..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాం అందించేందుకు చర్యలు చేపట్టాం. యూనిఫాంల డిజైన్ మార్చుతూ విధివిధానాలు ఖరారయ్యాయి. ఈనెలాఖారు వరకు జిల్లాకు టెస్కో ద్వారా ముడి వస్త్రం ఎమ్మార్సీలకు చేరుతుంది. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తాం. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే దుస్తులు అందిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

జిల్లాల వారీగా పాఠశాలలు, విద్యార్థులు అవసరమయ్యే వస్త్రం వివరాలు..

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య | కావాల్సిన వస్త్రం(మీటర్లలో) |
|---|---|---|---|
| మంచిర్యాల | 805 | 45,309 | 2,32,750 |
| ఆదిలాబాద్ | 1,194 | 73,582 | 3,40,567 |
| నిర్మల్ | 735 | 54,227 | 2,67,055 |
| ఆసిఫాబాద్ | 747 | 46,735 | 2,40,075 |

## దాతలు సాయం అందించరూ



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రవి

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన పాలాస రవి(40) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈనెల 5న హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేరిన రవికి ఈనెల 10న వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం రూ.రెండు లక్షల వరకు మందుల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కాగా తమకు మందులు కొనే స్థోమత లేదని దాతలు స్పందించి సాయం అందించాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. కాగా బాధితుడి తల్లి లలిత సైతం 20 రోజుల కిందట గొంతు క్యాన్సర్‌తో మృతి చెందింది. తల్లికి చికిత్స అందించేందుకు కొద్ది నెలల కిందట చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం మందులు కొనేంత శక్తి లేదని బాధిత కుటుంబీకులు వాపోయారు. బాధితుడు రవి భార్య చేతన మానసిక పరిస్థితి సైతం బాగా లేదు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రస్తుతం తండ్రి రాజన్న అన్ని తానై కొడుకుకు సేవలు చేస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్: 9959847511

## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి
- మెనూ పాటించడం లేదని పీవోకు ఫిర్యాదు
- వార్డెన్‌ను తొలగించాలని ఆర్‌సీవోకు ఆదేశాలు

నార్నూర్: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వరుణ్‌డ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ.. 15 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలవడంతో ఆదివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రిమ్స్ వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఘటన గురించి ఆరా తీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను వెంటనే తొలగించాలని ఆర్‌సీవోను ఆదేశించారు. బయటకు వచ్చిన పీవోకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా విద్యార్థులకు గుడ్లు, పల్లిపట్టీలు ఇవ్వడం లేదన్నారు. మెనూ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీవో మాట్లాడుతూ.. విద్యార్థులు మినరల్ నీరు తాగడంతో పాటు రక్తహీనత, న్యూట్రీషన్, కాల్షియం తక్కువగా ఉండడంతో శ్వాససమస్యతో బాధపడుతున్నారని తెలి పారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## చెరువులో పడి వీఆర్‌ఏ మృతి



శ్రీనివాస్(ఫైల్)

నిర్మల్‌టౌన్: నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న స్థానిక గొల్లపేట్‌కు చెందిన సిద్ధ శ్రీనివాస్(45).. ఆదివారం ఉదయం నిర్మల్ ధర్మసాగర్ చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. దీంతో తహసీల్దార్ సుభాశ్ చందర్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేలను ప్రశాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వీఆర్‌ఏ సిద్ధ శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాదేమియా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

## హోంగార్డు ఆత్మహత్యాయత్నం?

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు సురేందర్ ఆదివారం స్థానిక గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. భూవివాదంలో తనకు న్యాయం చేయాలంటూ ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన గోదావరి వద్దకు వెళ్లి జాలర్ల సాయంతో బాధితుడిని కాపాడినట్లు తెలిసింది.

## ఆటో బోల్తా.. ఒకరు మృతి



గడేకర్ గణపత్(ఫైల్)

భైంసాటౌన్(ముథోల్): పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రి గ్రామానికి చెందిన గడేకర్ గణపత్(60) శనివారం రాత్రి ఆటోలో భైంసాలోని బంధువుల ఇంటికి వస్తుండగా భైంసాలోని సాత్‌పూల్ వద్ద ఆటో బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన జెడ్ల నడిపి పోతన్న ఆదివారం ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. పోతన్నబావమరిది పెద్ద లస్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ దేవేందర్‌గౌడ్ తెలిపారు.

### బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

నార్నూర్: మండలంలోని పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ప్రేంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా లింగాపూర మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన సోయం శ్రీనివాస్ (28) బైక్‌పై నార్నూర్ మండలంలోని పూసిగూడ గ్రామంలో తన బంధువు పెళ్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పింది. బైక్ అతడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి తమ్ముడు సోయం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సమ్మేళనం పేరుతో సొమ్ములు స్వాహా

- పూర్వ విద్యార్థుల ఆవేదన
- నిర్వాహకులపై మండిపాటు
- పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్: పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పేరుతో లక్షల్లో డబ్బులు వసూలు చేసి తప్పుడు లెక్కలు చూపి, తమ సొమ్ములు స్వాహా చేశారని సింగరేణి కాలరీస్ హైస్కూల్ అలుమిని అసోసియేషన్ నాయకులు తెలిపారు. సీసీసీలోని సింగరేణి స్కూల్ వద్ద ఆదివారం అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవి శంకర్, ఉపాధ్యక్షులు పీ.రాజబాబు రెడ్డి, పప్పు శ్రీని వాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఇక్కడ పాఠశాల వద్ద 1986–2022ల టెన్త్ బ్యాచ్‌లతో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. తమతో పాటు చదువుకున్న ఒకరు ఈ కార్యక్రమం చేద్దామని ముందుగా ప్రతిపాదన పెట్టి నమ్మించడంతో, కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అతడి చేతుల్లో పెట్టినట్లు తెలిపారు. అతడు మరో ముగ్గురిని కలుపుకొని సంయుక్తంగా ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి డబ్బులు అందులో జమ చేసుకున్నారన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా కొంత బ్యాంక్ అకౌంట్‌కు, మరికొంత నగదు రూపంలో విరాళాలు ఇచ్చారు. ఇలా మొత్తం సుమారు రూ.40లక్షల వరకు జమ అయ్యాయన్నారు. ఇంత పెద్దయెత్తున డబ్బులు వసూలు చేసిన కూడా కార్యక్రమానికి హాజరైన వారికి సరైన తిండిపెట్టలేదని, ఒంటెద్దు పోకడలతో అందరిని కలుపుకోకుండా కార్యక్రమం చేయడం వల్ల పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. చివరికి తప్పుడు లెక్కలు చూపి ఫండ్‌ను దిగమింగారని ఆరోపించారు. కార్యక్రమానికి ఎంత ఖర్చు అయ్యిందో చెప్పమంటే సరైన లెక్కలు చూపకుండా అడిగితే బెదిరిస్తున్నారన్నారు. తప్పుడు లెక్కలతో కొన్ని లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. స్కూల్ పేరుతో ట్రస్ట్ ఓపెన్ చేసి తాము చదువుకు, పాఠశాలకు ఏదైనా చేయుతనందిస్తారనుకుంటే మొత్తం డబ్బులను స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



20 ఏళ్లకు..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా 20 ఏళ్ల కిందటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యా,బుద్ధులు నేర్పించిన ప్రధానోపాధ్యాయుడు దేవన్న, ఉపాధ్యాయులు హన్మత్‌రెడ్డి, భూమేశ్, గజేందర్, ఇస్రాహైమద్, నారాయణ, రుక్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నవీన్, సాయి, భోజన్న ఉన్నారు.

26 ఏళ్లకు..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

